క్లుప్తంగా

టికెట్ల ధరలు పెంచడం సరికాదు



మాట్లాడుతున్న మద్దెల శివకుమార్

కొత్తగూడెంరూరల్: పుష్ప 2 సినిమా టికెట్ల ధరలు పెంచటం సరికాదని, సినిమా విడుదల రోజు జరిగిన సంఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకోవాలని సినీగేయ రచయిత, గాయకులు మద్దెల శివకుమార్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలో మాట్లాడుతూ.. టికెట్ల ధరలు పెంచి సినీ నిర్మాతలు రూ.కోట్లు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. టికెట్ల రేటు పెంచకుండా, బెనిఫిట్ షోలను రద్దు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

జర్నలిస్టుల నిరసన



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఇల్లెందు: హైదరాబాద్‌లో జర్నలిస్టుల మీద సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఇల్లెందులో టీజేఎఫ్, ఐజేయూ ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మోహన్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీజేఎఫ్, ఏజేయూ నేతలు జి.రాజేష్, శోభన్, సుమంత్, వీరమోహన్, శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో క్రమబద్ధీకరణ చేపట్టాలి



తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: పట్టణంలో నివాసం ఉంటున్న చాలామంది ఇంటి స్థలాలకు ఎలాంటి హక్కు పత్రాలు లేవని, ఇల్లు మంజూరు కావాలంటే, బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే హక్కు పత్రాలు అవసరం అవుతున్నాయని, ప్రభుత్వం మరోమారు క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కె.రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గుగులోతు రాంచందర్ మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ జీఓ 76 ద్వారా గతంలో కొంతమందికి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. ఆ జీఓను మళ్లీ పునరుద్ధరించి పట్టణంలో అర్హులకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కొంతమంది చలాన్‌లు కట్టి పట్టాలు పొందలేకపోయారని చెప్పారు. కొంతమంది అవగాహన లేక దరఖాస్తు కూడా చేసుకోలేదన్నారు. మావునూరి మాధవ్, శాసనాల రామయ్య, సుచిత్ర, దోమల మహేశ్వర్, శివకుమార్ ఖండేల్‌వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు క్షమాపణ చెప్పండి..

పాల్వంచ: ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాసరెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సింధు తపస్వీ అన్నారు. పాల్వంచలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. మర్యాద లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- నిబంధనలతో అన్నదాతల ఇక్కట్లు
- ఈ ఏడాది పెరిగిన దిగుబడి
- అదనపు ఖర్చులు ప్రభుత్వమే భరించాలంటున్న రైతులు



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం, కాకర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. వ్యవసాయశాఖ అంచనా ప్రకారం ఈ ఏడాది మండలంలో 3,650 ఎకరాల విస్తీర్ణంలో వరి పంట సాగయింది. గత ఏడాది కంటే ఈ ఏడాది 250 ఎకరాల విస్తీర్ణంలో అధికంగా సాగు కావడంతో దిగుబడి పెరిగింది. సన్నం రకం వరి ఎకరానికి 25–30 క్వింటాళ్లు, ముదుగులు రకం ఎకరానికి 35–40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. పొలాల నుంచి ధాన్యాన్ని ట్రాక్టర్లు, ట్రాలీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన రైతులకు తేమ శాతం అధికంగా ఉందని, ఆరబెట్టాలని చెపుతుండటంతో ఆరబోయటానికి పట్టాలు రైతులే తెచ్చుకోవాల్సి వస్తుంది. 17 శాతం కంటే తక్కువ తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టి రాత్రిపూట కాపలా కాయాల్సి వస్తోందని రైతులు చెపుతున్నారు. ధాన్యంలో తాలు, మట్టిపెడ్డలు ఉన్నాయని ప్యాడీ మిషన్ (తాలు యంత్రం)లో పోసి గ్రేడింగ్ చేయాల్సి వస్తుందని అన్నదాతలు అంటున్నారు. ధాన్యం గ్రేడింగ్‌ను కూలీలతో చేయించాల్సి రావడంతో కూలీలకు క్వింటాకు రూ.100 అదనంగా చెల్లించాల్సి వస్తుందని, హమాలీలు, ధాన్యం తోలకం కోసం ఖర్చులు కూడా భరించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యం క్వింటా ధర రూ.2,320, సాధారణ(ముదుగు) రకం(సీ గ్రేడ్) ధాన్యం క్వింటా ధర రూ.2,300 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా ప్రభుత్వం సన్న రకానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నప్పటికీ కూలీలు, హమాలీలు, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు అదనంగా చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. పొలం నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించిన దగ్గర నుంచి లారీలకు లోడ్ చేసేంతవరకు రైతులే బాధ్యత వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. సహకార సంఘం వారు కేవలం గన్నీ బ్యాగులు, పురుకోస ఇస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేకపోవడంతో అకాల వర్షం వస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు సడలించాలని రైతులు కోరుతున్నారు. స్థానిక సహకార సంఘం వారి 1000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 223 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వరి ధాన్యం 17 శాతం తేమ ఉండేలా రైతులు ఆరబెట్టాలి. వ్యవసాయశాఖ అధికారుల నుంచి కూపన్ రైతులు పొందాలి. ఒరిజినల్ కూపన్, ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం, బ్యాంకు అకౌంట్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు నంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్‌ను స్థానిక సహకార సంఘం కార్యాలయంలో అందజేసి, ఆన్‌లైన్ చేయించుకోవాలని రైతులకు సహకార సంఘం అధికారులు సూచిస్తున్నారు.

నిబంధనలతో ఇబ్బంది..



నిబంధనల కారణంగా ఇబ్బంది పడుతున్నాం. తాలు, మట్టిపెడ్డలు ఉంటే గ్రేడింగ్ చేయాలని చెపుతున్నారు. తేమ 17 శాతం కంటే లోపు ఉండకపోతే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబెట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది 5 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తే ఎకరానికి 28–30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది.

– యల్లంకి వెంకటేశ్వరరావు, రైతు, వెంగన్నపాలెం

ధాన్యం ఆరబెడుతున్నాం...



తేమ శాతం 17 కంటే అధికంగా ఉందంటే నాలుగు రోజులుగా ఇక్కడే ఆరబోశాం. కొనుగోలు కేంద్రంలో ఆరబోయడంతో పగలు, రాత్రి కాపాలా కాయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకానికి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తుండటం సంతోషంగా ఉంది. కానీ నిబంధనలతో ఇబ్బందిగా ఉంది.

– హలావత్ ధనలక్ష్మి, రైతు, వెంగన్నపాలెం

ప్రభుత్వ నిబంధనల మేరకే కొనుగోళ్లు..



ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నాము. సహకార సంఘం ఆధ్వర్యంలో పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం, కాకర్లలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. గన్నీ బ్యాగులకు కొరత లేదు. రైతులు నిబంధనలు పాటించి తాలు, మట్టి, తేమ లేకుండా శుభ్రంగా ధాన్యాన్ని తీసుకురావాలి.

– రమణారెడ్డి, కార్యదర్శి, పీఏసీఎస్, జూలూరుపాడు

విద్యుత్ సదుపాయం కల్పించండి..



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న లక్కినేని, రైతులు

టేకులపల్లి: వ్యవసాయానికి బోరు బావులు ఏర్పాటు చేసుకునేందుకు విద్యుత్ సదుపాయం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన పలువురు బాధిత రైతులతో కలిసి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌సీ పేట పరిధిలో చెక్‌డ్యామ్ ఉన్నప్పటికీ సాగునీటిని వినియోగించుకునేందుకు విద్యుత్ సదుపాయం లేకపోవడం వల్ల అవస్థలు పడుతున్నామని, అధికారులు స్పందించి విద్యుత్ సదుపాయం కల్పించి ఆదుకోవాలని రైతులు కోరారు. చీమల సత్యనారాయణ, రైతులు ఈసం సురేష్‌బాబు, మేకల ముత్తయ్య, వాసం వీరమ్మ, పంజాల రాములు, ఈసం రఘుపతి పాల్గొన్నారు.

కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

జూలూరుపాడు: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని బుధవారం రాత్రి ఎంఈఓ బి.జుంకీలాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, నిత్యావసరాల స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. అదేవిధంగా మెను ప్రకారమే భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యతమైన భోజనం అందించాలని కేజీబీవీ ఎస్‌ఓకు సూచించారు. ఆ తరువాత విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓ పద్మజ, టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డి సేవలను గుర్తించాలి



మాట్లాడుతున్న ఆల్బర్ట్

సింగరేణి(కొత్తగూడెం): యూనియన్ కష్టకాలంలో ఉన్నప్పుడు వదిలేసి, చేయాల్సిన నష్టం చేసి మళ్లీ ఇప్పుడు యూనియన్‌లోకి రావాలని చూస్తున్నారని వారిని ఎట్టి పరిస్థితుల్లో చేర్చుకోవద్దని, దీనిని యూనియన్ పెద్దలు తీర్మానించారని ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం రీజియన్ జనరల్ సెక్రటరీ కే.ఆల్బర్ట్ అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని ఐఎన్‌టీయూసీ భవన్‌లో ఆయన మాట్లాడారు. సంజీవరెడ్డి 60 ఏళ్లుగా యూనియన్ అభివృద్ధికి కృషి చేశారని, చిన్న పరిశ్రమల నుంచి పెద్ద పరిశ్రమల వరకు సభ్యులను చేర్చి, దేశంలో సుమారు రూ.3 కోట్లకు పైగా సభ్యత్వం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంతర్జాతీయంగా యూనియన్‌ను ముందుకు తీసుకెళ్లిన మహా నాయకుడని, ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయనకు పద్మశ్రీ అవార్డును ప్రకటించాలని కోరారు. యూనియన్ ఈనెల 7న హైదారాబాద్‌లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలను తీర్మానించి, ఆమోదించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో కోవర్ట్‌ల వలన ఐదు ఏరియాల్లో ఓడిపోవటం జరిగిందని, ఈసారి గెలిచే విధంగా అందరూ కృషి చేయాలని ఇందుకోసం యూనియన్ సెక్రటరీ జనక్ ప్రసాద్ ఇప్పటి నుంచే ప్రణాళికలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేట్ వైస్ ప్రసిడెంట్ పీతాంబరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగ హేమరెడ్డి, మహేష్ కుమార్, రమేష్ కుమార్, వలస కుమార్, ఈవీ రావు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పి సహకరించండి..

పాల్వంచ: గ్యాస్ బుక్ చేశాక రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చే నాలుగు అంకెల ఓటీపీని డెలివరీ బాయ్‌కి చెప్పి సిలిండర్ పొందాలని హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెలివరీ బాయ్‌తో పాటు మా కార్యాలయం నుంచి వచ్చే మెకానిక్‌తో ఈ కేవైసీ, భద్రత తనిఖీలు చేయించుకోవాలని పేర్కొన్నారు. లేదంటే హెచ్‌పీసీఎల్ వారు తీసుకునే చర్యలకు పౌరసరఫరా సంస్థ ఎటువంటి బాధ్యత వహించదని తెలిపారు.

తెలంగాణ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర అభివృద్దే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్‌లో జరిగిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పాటైన ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం రుణమాఫీ, మహిళల సంక్షేమం కోసం గృహలక్ష్మి పథకం కింద రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్, ఉచిత బస్సు సౌకర్యం వంటి మరెన్నో పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సింగరేణి కార్మికుల చిరకాల కోరిక అయిన కార్మికుల సొంతింటి కల, ఇన్‌కమ్ ట్యాక్స్ మాఫీ వంటి హామీలను త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులతో మాట్లాడి త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలం నాగభూషణం, బూటిక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, చిలక రాజయ్య, ఎస్‌కే గౌస్ పాల్గొన్నారు.

తండాలు, గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్: తండాలు, గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపడుతున్నామని, పక్కా రహదారులు, డ్రెయినేజీలు, గ్రామాల మధ్య అనుసంధాన రహదారులు అనతికాలంలోనే పూర్తి చేసి రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సర్వారం, నర్సింహసాగర్, కొత్త అంజనాపురం, బేతంపూడి, సింగభూపాలెం పంచాయతీలో రూ.1.60 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులపై సర్వే నిర్వహించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు పర్యవేక్షించాలని, నాణ్యతతో నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, లోపాలను గుర్తిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. ఎస్‌కే సాబీర్ పాషా, నాగ సీతారాములు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' సర్వే



సుభాష్‌నగర్‌లో సర్వే చేస్తున్న ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి రజనీకాంత్

ఇల్లెందురూరల్: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలు వేసిన ప్రభుత్వం తాజాగా లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని సూచించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే ప్రారంభించారు. సేకరించిన వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి బుధవారం పలు గ్రామాలలో సర్వేను స్వయంగా పరిశీలించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు మంజూరు చేస్తామని ప్రకటించింది. అయితే గిరిజనులు, దళితులు, వితంతువులు, దివ్యాంగులకు ఇళ్ల మంజూరులో తొలి ప్రాధాన్యత ఉండనుంది. ఇదిలా ఉండగా తాము పనిచేస్తున్న పంచాయతీలలోనే సర్వే చేయాల్సి రావడం వల్ల భవిష్యత్‌లో రాజకీయ ఒత్తిళ్లు ఎదురవుతాయని, మంజూరు కాని వారి నుంచి కూడా ఇబ్బందులు ఎదురవుతాయన్న పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి..

టేకులపల్లి: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు దుబాకుల ప్రసాద్, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కత్తుల ఎర్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా బుధవారం టేకులపల్లి ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావుకు మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... గ్రామాలను శుభ్రం చేస్తూ పల్లెలను సుందరంగా తీర్చిదిద్దుతున్న గ్రామపంచాయతీ కార్మికులు సకాలంలో వేతనాలు అందక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను మరిచిపోయిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సమ్మెలో సమగ్ర శిక్షా ఉద్యోగులు..



సూపర్‌బజార్(కొత్తగూడెం): దీక్షా శిబిరంలో ఉద్యోగులు, నాయకులు



టేకులపల్లిలోని కేజీబీవీలో పాఠాలు బోధిస్తున్న ఎంఈఓ జగన్ నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారానికి సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూటీఎస్) బుధవారం సందర్శించి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.మంగీలాల్, ప్రధాన కార్యదర్శి లాల్ మహ్మద్, శంకర్, మోహన్, చందర్, సుబ్బారావు, శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా టీటీఎఫ్, ఏటీఎఫ్ సంఘాలు కూడా మద్దతు తెలిపాయి.

టేకులపల్లి: టేకులపల్లి మండలం సమగ్ర శిక్షా ఉద్యోగులు కేజీబీవీ ఉపాధ్యాయులు, వర్కర్స్, ఎంఎంఎస్, సీసీఓ, సీఆర్‌పీ, ఐఈఆర్‌పీ, మెసెంజర్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. 6,7 తేదీలలో రాష్ట్ర వ్యాపితంగా కలెక్టరేట్ల వద్ద నిరసనలు తెలియజేసిన వారు ఈనెల 9 నుంచి విధులకు వెళ్లకుండా నిరవధిక సమ్మె చేస్తున్నారు. మండలంలోని కేజీబీవీలో పని చేస్తున్న 24, ఎంఆర్‌సీలో పని చేస్తున్న 11 మొత్తం 35 మంది సమ్మెలో ఉండటంతో ఎంఆర్‌సీ మూత పడింది. కేజీబీవీలో పాఠాలు చెప్పేవారు లేక 6 నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు బుధవారం కేజీబీవీని సందర్శించిన ఎంఈఓ జగన్ నాయక్ పరిస్థితిని సమీక్షించారు. పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని గత సంవత్సరం డిసెంబర్‌లో ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, పాఠశాల విద్యా బలోపేతంలో కీలక పాత్రను పోషిస్తున్న తమను రెగ్యులరైజ్ చేసి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని, హెల్త్ కార్డులు జారీ చేయాలని టేకులపల్లి మండల జేఏసీ అధ్యక్షుడు బాదావత్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి డి.పార్వతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు క్రీడల్లో స్నేహపూరితమైన పోటీతత్వం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రగతి మైదాన్‌లో సీఎం కప్–2024 పోటీలను ప్రారంభించారు. మాట్లాడుతూ... క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వ్యసానానికి అలవాటుపడకుండా, ఆరోగ్యవంతమైన క్రీడలను ఎంచుకొని వాటి ద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఎంఈఓ ప్రభుదయాళ్, కమిషనర్ శేషాంజన్‌స్వామి, తహసీల్దారు పుల్లయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రెండో రోజు సాగిన క్రీడాపోటీలు..

ఇల్లెందు: పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో రెండో రోజు బుధవారం సీఎం కప్ పాఠశాలల క్రీడాపోటీలు జరిగాయి. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు డీఎస్పీ చంద్రభాను చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, తహసీల్దార్ కె.రవికుమార్, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎంఈఓ టీవీఆర్ఎస్ స్వామి, మండల పంచాయతీ అధికారి చిరంజీవి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



ఇల్లెందు: విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డీఎస్పీ చంద్రభాను తదితరులు

ముగిసిన ఆటల పోటీలు..

చుంచుపల్లి: చీఫ్ మినిస్టర్ కప్ క్రీడాపోటీలు రుద్రంపూర్ సెంట్ జోసెఫ్ హైస్కూల్‌లో బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా తహసీల్దార్ కృష్ణ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంపీడీఓ అశోక్ కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీఓ సత్యనారాయణ, సెండ్ జోసెఫ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, సెక్రటరీలు పాల్గొన్నారు.



చుంచుపల్లి: బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం





ఇల్లెందు: డాక్టర్లు, సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్, పాల్వంచ వైద్యులు సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న జితేష్ వి.పాటిల్

ఇల్లెందు: కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మారి రెండేళ్లు అవుతున్న సందర్భంగా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో ప్రజలకు అందుతున్న మెరుగైన వైద్యసేవలను ప్రభుత్వం గుర్తించిందని, అందుకు ప్రతిఫలంగా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం, అభినందనలు అందాయని ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ జి.హర్షవర్ధన్ తెలిపారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో మాట్లాడుతూ.. కలెక్టరేట్ నుంచి అనుకోకుండా ఆహ్వానం వచ్చిందని, డాక్టర్లు, సిబ్బందితో వెళ్లగా కలెక్టర్ చాంబర్‌లో ఇల్లెందు వైద్యులకు ప్రశంసా పత్రం అందజేసి అభినందలు తెలిపినట్లు చెప్పారు. ఇక్కడ అందుతున్న సేవల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఇదే ఒరవడి కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీసీహెచ్ఎస్ డాక్టర్ జి.రవిబాబు, సూపరింటెండెంట్ డాక్టర్ జి.హర్షవర్ధన్, డాక్టర్లు రాంనివాస్, బన్సీలాల్, నర్సింగ్, పారా మెడికల్ స్టాఫ్ ఉన్నారు.

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో వైద్యసేవలు మరింత మెరుగయ్యాయని, ఇందుకు జాతీయ స్థాయి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ రావడమే నిదర్శనమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. సర్టిఫికెట్ రావడం పట్ల బుధవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, మెడికల్ ఆఫీసర్ రాంప్రసాద్‌లను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఆస్పత్రిలో గత నెల ప్రసవాల సంఖ్య వందకు పెరగడం, ఖరీదైన మోకాళ్లు, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు, రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న 60 ఏళ్ల మహిళకు శస్త్ర చికిత్స నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వైద్యులు డాక్టర్ సరళ, సోమరాజు దొర, శైలేష్‌కుమార్‌లను అభినందించారు. ఇప్పటి వరకు రూ.78లక్షలు ఎమ్మెల్యే డీఎంఎఫ్‌డీ ఫండ్‌తో ఆస్పత్రికి కావలసిన సామగ్రికి తెప్పించడం జరిగిందని, ఆస్పత్రిలో మహిళా శక్తి క్యాంటీన్, ఓపెన్ జిమ్ త్వరలో ఏర్పాటు కానున్నాయని, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందిందేందుకు సహాయ సహకారం అందిస్తానన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.